# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

బుధవారం 5, ఆగస్టు 2026




## అంగన్వాడీల్లో చిన్నారులందరికీ పోషకాహారం అందాలి

**✻ గిరిజనాభివృద్ధి శాఖ విద్యాసంస్థల్లో మెరుగైన వసతులు కల్పించాలి**

**✻ నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్, ఆగస్టు 04, ప్రభాతవార్త:**

జిల్లాలోని అన్ని అంగన్వాడీల్లో చిన్నారులకు తప్పనిసరిగా నాణ్యమైన పోషకాహారం అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంగన్వాడీలు, గిరిజనాభివృద్ధి సంస్థ విద్యాసంస్థలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల్లో ప్రతిరోజూ నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ పిల్లల వికాస వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి ప్రత్యేక ఆహారం అందించాలని సూచించారు. సూపర్‌వైజర్లు తరచూ కేంద్రాలను తనిఖీ చేస్తూ పిల్లల హాజరు, వసతులను పరిశీలించాలని ఆదేశించారు. కేంద్రాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తామని తెలిపారు.అభా గుర్తింపు కార్డుల నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని, వలస కూలీల పిల్లలకు కూడా పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనుమతులు లభించిన అంగన్వాడీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేస్తామని, అర్హత కలిగిన పిల్లలందరినీ అంగన్వాడీల్లో చేర్పించాలని స్పష్టం చేశారు. అలాగే గిరిజనాభివృద్ధి శాఖ పరిధిలోని విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన వసతులతో కూడిన విద్యను అందించాలని ఆదేశించారు. సమావేశంలో ప్రీమెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డిటిడివో నిహారిక, జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## భూ భారతి పోర్టల్‌పై అవగాహన కలిగి ఉండాలి



**కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 4, ప్రభాతవార్త**

భూ భారతి పోర్టల్‌లోని ప్రతి అంశము పై జూనియర్ అసిస్టెంట్లు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ హరిత అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో అన్ని మండలాల జూనియర్ అసిస్టెంట్లకు భూ భారతి పోర్టల్ పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జూనియర్ అసిస్టెంట్లు కేవలం తహశీల్దార్ కార్యాలయంలోని ధరణి వంటి బాధ్యతలే కాకుండా భూ భారతి పోర్టల్‌లోని ప్రతి అంశముపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భూ సేకరణ అంశాలు, దరఖాస్తులు, ఇతర అంశాలు ఏ పనిని అప్పగించినా నిర్వహించడానికి సిద్ధంగా ఉండాలన్నారు. భూ భారతి పోర్టల్‌లోని ప్రతి అంశమును అవగాహన చేసుకుని సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లు చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో భూ భారతి కోఆర్డినేటర్ రాము, రవికాంత్, జిలాని, జూనియర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందించాలి

**ఆసిఫాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త :**

ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. మంగళవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, మూత్రశాలలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, వంటశాల, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల నమోదు శత శాతం ఉండేలా ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. పాఠశాలకు గైర్హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకొని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో అనేక మౌలిక వసతులు కల్పించడం జరిగిందని, సుశిక్షితులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన అందించడం జరుగుతుందని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు విద్య బోధన చేయాలని తెలిపారు. విద్యార్థులకు ఈ నెల 15 లోపు 2 జతల ఏకరూప దుస్తులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**✻ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 04, ప్రభాతవార్త**

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్, సాదాబైనామా, భూ భారతి దరఖాస్తులు, రీసర్వే పనులు తదితర కార్యక్రమాలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం తాండూర్ మండలంలోని కార్తికేయ ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పరిశీలించి సీఎంఆర్ బకాయిల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ సీఎంఆర్‌ను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని మిల్లర్ లను ఆదేశించారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ (ఎస్‌ఎల్‌ఆర్) ఎ.డి.తో కలిసి తాండూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పెండింగ్ సాదా బైనామా, భూ భారతి దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు. సాదా బైనామా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో అందిన దరఖాస్తులను రికార్డులను అనుసరించి, క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. రాంపూర్ గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనుల పురోగతిని తెలుసుకుని, త్వరగా రాంపూర్ రీసర్వే ప్రక్రియను *మిగతా 2లో..*





## ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం


■ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య

**లక్షెట్టిపేట, ఆగస్టు 04, ప్రభాతవార్త**

ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు సురక్షితమైన వాతావరణంతో పాటు నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్, మండల విద్యాధికారి, మున్సిపల్ చైర్‌పర్సన్, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాళ్లతో కలిసి పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నీట మునిగిన ముల్కలగూడ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పాఠశాల ప్రాంగణంలో నిల్వ ఉన్న వర్షపు నీటిని పరిశీలించి, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సమీప ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను తాత్కాలికంగా తరలించిన చర్యను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థుల చదువుకు ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులను తరలించిన సమీప ప్రభుత్వ పాఠశాలను సందర్శించి తరగతి గదులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ప్రతికూల *మిగతా 2లో..*

# పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు**



**తాండూర్, ఆగస్టు 4, ప్రభాతవార్త :**
జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్, సాదాబైనామా, భూ భారతి దరఖాస్తులు, రీసర్వే పనులు వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు అన్నారు. తాండూర్ తహసిల్దార్ కార్యాలయాన్ని, కార్తికేయ రైస్‌మిల్లును మంగళవారం ఆయన సందర్శించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో వచ్చిన సాదా బైనామా, భూభారతి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. రాంపూర్ గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే ప్రక్రియ త్వరగా పూర్తి చేసి మరో 5 గ్రామాలలో అదనంగా రీసర్వే పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న వివిధ ధ్రువపత్రాల దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి, త్వరితగతిన జారీ చేయాలని, అన్ని పెండింగ్ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ సీఎంఆర్‌ను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని మిల్లర్లకు సూచించారు. అదనపు కలెక్టర్ వెంట సర్వే అండ్ ల్యాండ్ ఎడి శ్రీనివాస్, తహసిల్దార్ జ్యోత్స్న, నాయబ్ తహసిల్దార్ కల్పన, గిర్దావర్ పద్మజ, మండల సర్వేయర్ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

# పోడు రైతుల సమస్యలు పరిష్కరించాలి

**- ఎఫ్‌డీఓకు వినతిపత్రం అందజేసిన జాతీయ మహిళా కాంగ్రెస్ కార్యదర్శి అదిత**




**సిర్పూర్(టి), ఆగస్టు 4 ప్రభాతవార్త :**
పోడు రైతుల సమస్యలను పరిష్కరించి, ఏళ్ల తరబడి పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జాతీయ మహిళా కాంగ్రెస్ కార్యదర్శి బి. అదిత కోరారు. ఈ మేరకు సిర్పూర్(టి) మండలం డోర్పల్లి గ్రామానికి చెందిన పోడు రైతులతో కలిసి అటవీశాఖ ఎఫ్‌డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అదిత మాట్లాడుతూ.. డోర్పల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు సుమారు 40 ఏళ్లుగా పోడు భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూముల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పోడు రైతుల సమస్యలను గతంలోనే అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అటవీశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు.పోడు రైతులు సాగు చేసుకుంటున్న భూముల విషయంలో అటవీశాఖ అధికారులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. రైతులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ వ్యవసాయ పనులు చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా, వారి సమస్యలను పరిశీలించి తగిన పరిష్కారం చూపాలని కోరారు.పోడు రైతుల సమస్యలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అదిత విజ్ఞప్తి చేశారు. రైతులకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డోర్పల్లి గ్రామానికి చెందిన పోడు రైతులు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ సమన్వయంతో పనిచేయాలి

**- బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్**

**బజార్‌హత్నూర్, ఆగస్టు 04, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అందరూ సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదిలాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ మాట్లాడుతూ.. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కమిటీల ఏర్పాటు, గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని పటిష్టం చేయడంపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఆడే గజేందర్ మాట్లాడుతూ.. నూతన మండల కమిటీల నియామకంలో వర్గ విభేదాలకు తావులేకుండా, సామాజిక న్యాయం పాటిస్తూ పారదర్శకంగా కమిటీలను వేయాలని సూచించారు. ప్రతి మండల కమిటీలో అధ్యక్షుడితో కలిపి 21 మంది సభ్యులు ఉండాలని, మహిళలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. సీనియర్ నాయకుల అనుభవాన్ని వినియోగించుకునేందుకు ప్రతి మండలంలో పొలిటికల్ అఫైర్స్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆగస్టు 15లోగా మండల కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని ఆదేశించారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీ అధిష్ఠానం తగిన గౌరవం కల్పిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మాజీ డీసీసీ అధ్యక్షుడు సాజీద్ ఖాన్, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్ రెడ్డి, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి, కళ్యాం విఠల్ తదితరులు పాల్గొన్నారు.





# పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**
పూర్తిచేసి మరో 5 గ్రామాలలో అదనంగా రీసర్వే పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న వివిధ ధ్రువపత్రాల దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి త్వరితగతిన జారీ చేయాలని, అన్ని పెండింగ్ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బెల్లంపల్లి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి సాదాబైనామా, భూ భారతి దరఖాస్తుల పురోగతిని సమీక్షించారు. పెండింగ్ ధ్రువపత్రాల జారీ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అన్ని రెవెన్యూ సంబంధిత పనులను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నస్పూర్ తహసీల్దార్ తో కలిసి నస్పూర్ మండలంలోని తీగల్‌పహాడ్ ఎంఎల్ఎస్ గోదాంను సందర్శించి ఐసీడీఎస్ కేంద్రాలు, పాఠశాలలకు నిత్యావసర సరుకుల సరఫరా పురోగతిని సమీక్షించారు. సంబంధిత డీలర్‌కు ఈకేవైసీ ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. స్టేజ్2 కాంట్రాక్టర్‌కు సరిపడా వాహనాలను అందుబాటులో ఉంచి, ఐసీడీఎస్ కేంద్రాలు, పాఠశాలలకు సరుకులు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం

**(మొదటిపేజీ తరువాయి)**
పరిస్థితులలోనూ విద్యా బోధన నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులలో ఎలాంటి ఆందోళన లేకుండా సానుకూల వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన అన్ని సౌకర్యాలను వెంటనే అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి తరగతి గదులు, గ్రంథాలయం, త్రాగునీటి సౌకర్యం, పారిశుద్ధం, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యా సదుపాయాలపై అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి, గ్రంథాలయ వినియోగం, క్రమబద్ధమైన బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో మెరుగైన విద్యా ప్రమాణాలు నెలకొనేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.

## శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేయస్కరం

**ఐసిడిఎస్ ఆంగ్రాజుపల్లి సెక్టార్ ఇంచార్జ్ పద్మ**



**చెన్నూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త**
పసిపిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేయస్కరమని ఐసిడిఎస్ ఆంగ్రాజుపల్లి సెక్టార్ ఇంచార్జ్ పద్మ అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం ఆస్నాద్ గ్రామంలోని రెండు అంగన్వాడి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ ఇంచార్జీ పద్మ మాట్లాడుతూ చిన్నారుల ఎదుగుదలకు తల్లిపాలతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషక పదార్థాలు పాలు, గుడ్లు, బాలామృతం, తదితర వాటిని పిల్లలకు ప్రతిరోజూ పెట్టాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బందికి గర్భిణులు, బాలింతలకు తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. జననం అయిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వాలని, మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే అందించాలని, తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారం అందించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని వివరించారు. అనంతరం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించి పిల్లలకు పాలు, గుడ్లు, బాలామృతం, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బెల్లంకొండ సజిత జగన్మోహన్ రావ్, అంగన్వాడీ టీచర్స్ సుజాత, పద్మ, గర్భిణీలు, తల్లులు పాల్గొన్నారు.

# మృతదేహం తరలింపుపై అంబులెన్స్ సిబ్బంది దౌర్జన్యం..?

## మార్గమధ్యలో వాహనాన్ని అడ్డగించి ఆస్పత్రికి రప్పింపు - మా అంబులెన్స్‌లోనే తీసుకెళ్లాలి అంటూ బెదిరింపుల ఆరోపణలు

**మంచిర్యాల, ఆగస్టు 4, ప్రభాతవార్త**

కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న వేళ మృతదేహం తరలింపుపై అంబులెన్స్ సిబ్బంది వ్యవహరించిన తీరు తీవ్ర వివాదానికి దారితీసింది. ఇంటికి తీసుకెళ్తున్న మృతదేహాన్ని మార్గమధ్యలో అడ్డగించి, తిరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చి తమ అంబులెన్స్‌లోనే తరలించాలని పట్టుబట్టిన ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదుతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం.. పట్టణంలోని పి.ఆర్. శంకరయ్య అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వెలగపూడి నాగభూషణం (65) సోమవారం రాత్రి సుమారు 10.30 గంటలకు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు స్థానికంగా తమకు తెలిసిన అంబులెన్స్‌లో ఆయనను పట్టణంలోని వసుధ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి శవపరీక్ష నిర్వహించారు. శవపరీక్ష అనంతరం కుటుంబసభ్యులు మృతదేహాన్ని తమకు ముందే ఏర్పాటు చేసుకున్న అంబులెన్స్‌లో ఇంటికి తీసుకెళ్తుండగా, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న మరో అంబులెన్స్ సిబ్బంది ఆ వాహనాన్ని అడ్డుకున్నట్లు ఆరోపించారు. మేం లైన్‌లో ఉన్నాం.. మా అంబులెన్స్‌లోనే మృతదేహాన్ని తీసుకెళ్లాలి అంటూ వాగ్వాదానికి దిగారని, ఇప్పటికే బయలుదేరిన వాహనాన్ని బలవంతంగా తిరిగి ఆస్పత్రికి రప్పించి, అక్కడి నుంచి తమ అంబులెన్స్‌లోనే మృతదేహాన్ని తరలించారని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఖఇక్కడ అంబులెన్స్ పాయింట్ మాది.. ఇక్కడ మేమే సీనియర్లం.. మేం చెప్పిందే నడవాలి.. మా తర్వాతే మీరుగఏ అంటూ బెదిరింపులకు పాల్పడ్డారని బాధితులు ఆరోపించారు. అత్యంత విషాద సమయంలో ఇలాంటి పరిస్థితి ఎదురుకావడం తమను తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబసభ్యులు కోరుతున్నారు. అధికారులు స్పందించి విచారణ చేపడతారా లేదా అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.



# రూ. 20 లక్షల సీసీ రోడ్డు ప్రొసీడింగ్ కాపీ అందజేత

## - మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పాటిల్

**భైంసా, ఆగస్టు 04, ప్రభాతవార్త:**

ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పాటిల్ బెల్తారోడా గ్రామానికి మంజూరైన రూ. 20 లక్షల సీసీ రోడ్డు ప్రొసీడింగ్ కాపీని గ్రామస్థులకు అందజేశారు. అలాగే బెల్తారోడా గ్రామంలోని శ్రీ కృష్ణ మందిరానికి రూ. 30 లక్షల నిధులతో టెండర్ ప్రక్రియ పూర్తి చేయించినందుకు గ్రామస్థులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా భైంసాలోని ఆయన నివాసంలో నారాయణరావు పాటిల్‌ను గజమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మధు పటేల్, అటల్ దేవదాస్, చంద్రకాంత్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్రే, కుంటాల మాజీ ఎంపీపీ భోజరాం పటేల్, సీనియర్ నాయకులు శ్యామ్‌రావు పటేల్, తుంగని శంకర్, పురంశెట్టి రవి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# తల్లి పాలే శిశువుకు సంపూర్ణ ఆహారం

## - ఆలుగామలో వైభవంగా అంతర్జాతీయ తల్లి పాల వారోత్సవాలు

## - గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన

**కోటపల్లి, ఆగస్టు 4, ప్రభాతవార్త**

అంతర్జాతీయ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం ఆలుగామ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గర్భిణులకు శ్రీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ సంధ్య, ఆరోగ్య శాఖ ఏఎన్ఎం మాధవి మాట్లాడుతూ.. శిశువు పుట్టిన గంటలోపే తల్లి పాలు పట్టించడం చాలా అత్యవసరమని తెలిపారు. పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అదే శిశువుకు సంపూర్ణ ఆహారమని స్పష్టం చేశారు. తల్లి పాలలో ఉండే పోషకాలు బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడతాయని, అలాగే వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని పేర్కొన్నారు. తల్లి పాల వల్ల చిన్నారులకు ఇన్‌ఫెక్షన్లు, పోషకాహార లోపం వంటి సమస్యలు రాకుండా ఉంటాయని, ప్రతి తల్లి తప్పనిసరిగా బిడ్డకు పాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మొండక్క, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



# కనీస వసతులు లేక అవస్థలు పడుతున్న విద్యార్థులు

## - అధికారులు స్పందించడం లేదని బీఆర్ఎస్వీ ఆగ్రహం

**నిర్మల్, ఆగస్టు 04, ప్రభాతవార్త:**

జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్వీ జిల్లా ఉపాధ్యక్షులు మిర్జాబే ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసనలు, ధర్నాలు చేస్తున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని ఆయన మంగళవారం విలేకరులతో అన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, బెంచీలు, ఆట స్థలం వంటి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెబుతున్నా, జిల్లా కేంద్రంలోనే ఈ పరిస్థితి ఉండటం దుర్మార్గమని విమర్శించారు. వర్షాకాలంలో తరగతి గదుల్లోకి నీరు చేరడం, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో వేడికి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని పేర్కొన్నారు. మరుగుదొడ్లు లేక బాలికలు ఇళ్లకు వెళ్లిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్వీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ర్యాలీ, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

## - విద్యారంగ సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం

**భైంసా, ఆగస్టు 04, ప్రభాతవార్త:**

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో మంగళవారం భైంసాలో విద్యార్థులు భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం మెయిన్ గేట్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు వాగ్మారే మహేందర్ మాట్లాడుతూ.. ఏళ్లు గడుస్తున్నా విద్యారంగంలో సమస్యలు పరిష్కారం కావడం లేదని, ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ డిమాండ్లను పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి పవార్ కిరణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షురాలు వి. గోదావరి, నాయకులు సంతోష్, సిద్ధార్థ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షానికి విరిగిపడిన చెట్లు, కూలిన ఇల్లు

## - తక్షణమే స్పందించిన కార్పొరేటర్ అగ్గు సాగర్

**నస్పూర్, ఆగస్టు 4, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 34వ డివిజన్‌లో మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల విద్యుత్ స్తంభాలపై చెట్లు విరిగిపడటంతో పాటు ఒక ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ అగ్గు సాగర్, వార్డు అధ్యక్షుడు పెంచాల వేణు, నాయకుడు బైరం ప్రభాకర్, ఇతర స్థానిక నేతలతో కలిసి వెంటనే క్షేత్రస్థాయికి చేరుకున్నారు. వర్షం కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి, విద్యుత్ స్తంభాలపై పడిన చెట్ల కొమ్మలను తొలగింపజేశారు. ఇల్లు కూలిపోయిన బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. డివిజన్ పరిధిలో వర్షం వల్ల ఉత్పన్నమైన విద్యుత్, పారిశుద్ధ్య సమస్యలను తక్షణమే పునరుద్ధరించి, ప్రజలకు ఎలాంటి తీవ్ర ఇబ్బందులు కలగకుండా స్థానిక నాయకులు, సిబ్బందితో కలిసి సమస్యలను పరిష్కరించారు.



# అడవి పందుల అక్రమ రవాణా

## - బాసర అటవీశాఖ చెక్‌పోస్ట్ వద్ద స్వాధీనం చేసుకున్న అడవి పందులు, బొలెరో వాహనంతో అటవీశాఖ అధికారులు, సిబ్బంది

**భైంసా, ఆగస్టు 04, ప్రభాతవార్త:**

బాసర గోదావరి వద్ద ఉన్న అటవీశాఖ చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో అడవి పందులను అక్రమంగా తరలిస్తున్న బొలెరో వాహనాన్ని అటవీశాఖ అధికారులు పట్టుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి సిద్ధిపేటకు సుమారు 23 అడవి పందులను బొలెరో వాహనంలో తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు వాహనంతో పాటు ఇద్దరినీ భైంసా అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు డిప్యూటీ రేంజ్ అధికారి ఎం. శంకర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న అడవి పందులకు వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వాటిని అటవీ ప్రాంతంలో వదిలివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఫారెస్ట్ బీట్ అధికారులు శివ, సంజయ్, చెక్‌పోస్ట్ వాచర్లు సద్దాం, నరేంద్ర, యానిమల్ ట్రాకర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



# భద్రతా పక్షోత్సవాల్లో బహుమతులు సాధించడం శ్రీరాంపూర్ ఏరియాకు గర్వకారణం

**- ఓవరాల్ సెకండ్ ప్రైజ్, శాండ్ స్టోవింగ్‌లో మొదటి బహుమతి గెలుచుకున్న ఆర్.కె-7 గని**

**- వచ్చేసారి ఫైవ్ స్టార్ రేటింగ్, సేఫ్టీలో నంబర్ వన్ స్థానం సాధించాలి - శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**

నస్పూర్, ఆగస్టు 4, ప్రభాతవార్త

వార్షిక భద్రతా పక్షోత్సవాల్లో రెండు కీలక బహుమతులు సాధించడం శ్రీరాంపూర్ ఏరియాకు ఎంతో గర్వకారణం. వచ్చేసారి భద్రతా పక్షోత్సవాల్లో మొదటి బహుమతితో పాటు ఆర్.కె-7 గని ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. 56వ వార్షిక భద్రతా పక్షోత్సవాల బహుమతుల ప్రధానోత్సవంలో రెండు పురస్కారాలు పొందిన సందర్భంగా మంగళవారం ఆర్.కె-7 గని వద్ద ఏర్పాటు చేసిన అభినందన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అధికారులు, ఉద్యోగులను అభినందించారు. 2025-26 వార్షిక భద్రతా పక్షోత్సవాలలో భాగంగా ఆర్‌జీ1 ఏరియాలో నిర్వహించిన ప్రధానోత్సవంలో డీజీఎంఎస్ అధికారుల చేతుల మీదుగా ఆర్.కె-7 గని గ్రూప్1 విభాగంలో ఓవర్‌ఆల్ సెకండ్ ప్రైజ్‌తో పాటు, శాండ్ స్టోవింగ్‌లో ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా గని వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జీఎం మునిగంటి శ్రీనివాస్ ఈ బహుమతులను సేఫ్టీ కమిటీ సభ్యులకు, అధికారులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జులై మాసం ఉత్పత్తిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా ఉన్న పెద్ద భూగర్భ గనులలో ఆర్.కె7 గని ఓవర్‌ఆల్ సెకండ్ ప్రైజ్ సాధించడంతో పాటు శాండ్ స్టోవింగ్‌లో నంబర్ వన్ స్థానంలో నిలవడం హర్షణీయమన్నారు. సింగరేణిలోనే శ్రీరాంపూర్ ఏరియా అత్యధికంగా 19 బహుమతులు సాధించడమే ఇక్కడ రక్షణకు ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శన మన్నారు. జీఎం నుంచి కింది స్థాయి కార్మికుడి వరకు ప్రతీ ఒక్కరి సమిష్టి కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. అలాగే మణుగూరు పీకే ఓసీ డిప్ సైడ్ బ్లాక్ సింగరేణికి దక్కడం ప్రతీ ఒక్క కార్మికుడు సంతోషించాల్సిన విషయమని, మిగిలిన బ్లాక్‌లు కూడా సింగరేణికే దక్కుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్.కె-7 గనిలో మంచి వర్కింగ్ ప్లేస్‌లు ఉన్నాయని, అవసరమైన యంత్రాలు, పనిముట్లు సమకూరుస్తున్నామని, ఉద్యోగులు 100 శాతం రక్షణతో కూడిన నాణ్యమైన ఉత్పత్తి సాధించి సంస్థ పురోగతికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.కె గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, గని మేనేజర్ తిరుపతి, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఏరియా వైస్ ప్రెసిడెంట్ కొట్టె కిషన్ రావు, రక్షణ అధికారి సంతోష్, సంక్షేమ అధికారి సంతన్, పిట్ సెక్రటరీ సారయ్య, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



భద్రతా పక్షోత్సవాల విజేతలకు బహుమతులు అందజేస్తున్న జీఎం మునిగంటి శ్రీనివాస్, అధికారులు



## అన్ని దానాల్లోకల్లా.. అన్నదానం గొప్పది

**- మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు**

బెల్లంపల్లి, ఆగస్టు 04, ప్రభాతవార్త

జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ అన్న దాన కార్యక్రమం 423 వ సారి బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి-రమేష్ బాబు హాజరై మాట్లాడారు. అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని ఐదు సంవత్సరాలు గా బాటసారులు నిరుపేదల ఆకలి తీర్చుతున్న జనహిత సేవలు అభినందనీయం అని అన్నారు. జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం 423వ సారి దాత కీ.శే.కారుకూరి సాయి కుమార్ జయంతి సందర్భంగా వారి జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి వరలక్ష్మి-రాంచెందర్ దంపతులు నిరుపేదలు, కూలీలు, చిరువ్యాపారులు, బాటసారులకి ఒక పూట ఆకలి తీర్చేందుకు అన్న దాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమంలో సుమారు 180 మందికి ఒక పూట భోజనం అందించడం జరిగిందని, ఈ జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం విజయవంతం కొరకు మరింత మంది దాతలు ముందుకు రావాలని అలాగే సహాయ సహకారాలు అందిస్తున్న దాతలందరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాత మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచెందర్ పలువురు బెల్లంపల్లి మండల మరియు పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు మరియు జనహిత సేవా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కాంపెల్లి విజయ్ కుమార్, కోశాధికారి కొడిపెల్లి గిరిప్రసాద్, సహాయ కార్యదర్శి గొడిసెల శేఖర్, కార్యవర్గ సభ్యులు నిచ్చకోల గురుస్వామి, చిలుముల సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యతో వెలుగులు నింపిన నవోదయ

**- నేడు జవహర్ నవోదయ విద్యాలయ స్థాపన దినోత్సవం**

ఆసిఫాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:

నవోదయ విద్యతో విద్యార్థుల జీవితంలో వెలుగులు నింపుతోందని జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి పేర్కొన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ 39వ స్థాపన దినోత్సవంను పురస్కరించుకొని మంగళవారం కలెక్టరేట్లోని డిఈఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కృష్ణ తో కలిసి పాల్గొని మాట్లాడారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 5న జవహర్ నవోదయ విద్యాలయాల స్థాపన దినోత్సవం జరుపుకుంటారని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన, ఉచిత నివాస విద్యను అందించాలనే లక్ష్యంతో 1986లో ఈ విద్యాలయాల వ్యవస్థ ఏర్పాటైందన్నారు. జాతీయ విద్యా విధానం ఆధారంగా ప్రారంభమైన ఈ పాఠశాలలు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దాయని పేర్కొన్నారు. అవకాశం లభిస్తే గ్రామీణ విద్యార్థుల ప్రతిభ ప్రపంచ స్థాయికి చేరగలదని, జవహర్ నవోదయ విద్యాలయాలు విద్యార్థులకు కేవలం విద్యనే కాదు, మంచి వ్యక్తిత్వాన్ని, విలువలను, ఆత్మవిశ్వాసాన్ని కూడా అందిస్తున్నాయన్నారు. అంతకుముందు నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్య మనిషిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని, ప్రతిభకు అవకాశాన్ని కల్పించే జవహర్ నవోదయ విద్యాలయాలు దేశ భవిష్యత్తుకు బలమైన పునాదన్నారు. నవోదయలో చదివిన విద్యార్థులు ప్రస్తుతం దేశంలోని అన్ని రంగాలలో రాణిస్తున్నారని తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలకు కాగజ్నగర్ లోని నవోదయ విద్యాలయ కేంద్రంలో విద్యాలయ స్థాపక దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం నవోదయ విద్యాలయంలో చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాల ప్రిన్సిపాల్ తో కలిసి డిఈఓ కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నవోదయ పాఠశాల పేరెంట్ నెంబర్ ఉషన్న, సీనియర్ ఉపాధ్యాయుడు రామయ్య తదితరులు పాల్గొన్నారు.






## సింగరేణికి కొత్త బొగ్గు గని కేటాయింపు స్వాగతార్హం: కేంద్రానికి బీజేపీ కృతజ్ఞతలు

**- ప్రేమ్‌సాగర్‌రావు ఆస్తులు, రుణాల చెల్లింపులపై ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని రఘునాథ్ వెరబెల్లి డిమాండ్**

మంచిర్యాల,ఆగస్టు 4, ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు మణుగూరు బొగ్గు గనిని కేటాయించినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఎలాంటి వేలం ప్రక్రియ లేకుండా సింగరేణికి తాడిచెర్ల-రెండు, మణుగూరు బొగ్గు గనులను కేటాయించడం వల్ల సంస్థ ఆదాయం పెరగడంతో పాటు రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని అన్నారు. మణుగూరు గని ద్వారా ముప్పై ఏళ్లలో సుమారు నూట ఎనభై మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగి, సింగరేణికి రూ. నలభై రెండు వేల మూడు వందల అరవై కోట్లు, రాష్ట్ర ప్రభుత్వానికి రూ. పది వేల ఐదు వందల కోట్ల ఆదాయం సమకూరడంతో పాటు రెండు వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. మొత్తం మూడు బొగ్గు గనుల ద్వారా సింగరేణికి భారీ ఆదాయం, వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అనంతరం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుపై విమర్శలు గుప్పించిన రఘునాథ్ వెరబెల్లి, ఎన్నికల ముందు వివిధ బ్యాంకులకు భారీగా బకాయిలు ఉన్నప్పటికీ ఏడాదిన్నర వ్యవధిలో ఆ రుణాలు ఎలా చెల్లించారో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి స్పష్టమైన సమాధానం చెప్పాలని కోరారు.

## తల్లిపాలే శిశువు ఆరోగ్యానికి తొలి వరం

**- ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మాతా శిశు కేంద్రంలో అవగాహన కార్యక్రమం**

మంచిర్యాల, ఆగస్టు 4, ప్రభాతవార్త

ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జిల్లా మాతా శిశు సంరక్షణ కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, అంగన్‌వాడీ విభాగం, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ పుట్టిన గంటలోపే తల్లిపాలు ప్రారంభించి, తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలే శిశువుకు తొలి ఆహారం, తొలి టీకా, తొలి రక్షణ అని పేర్కొన్నారు. తల్లిపాల వల్ల శిశువుకు పోషకాహారం, వ్యాధి నిరోధక శక్తి, మెరుగైన శారీరక, మానసిక ఎదుగుదల లభిస్తాయని, తల్లికి కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. జిల్లాలో ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఏడో తేదీ వరకు అన్ని ఆరోగ్య కేంద్రాలు, గ్రామపంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, మాతా శిశు కేంద్రంలోని సేవలను పరిశీలించి నవజాత శిశు విభాగాన్ని సందర్శించిన డాక్టర్ నరేందర్ రాథోడ్ హెల్ప్‌డెస్క్ ద్వారా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సంచాలకుడు డాక్టర్ అశోక్ కుమార్, వైద్యులు, సంక్షేమ శాఖ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులకు అరటిపండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.





## స్వర్ణ ప్రాజెక్ట్ నీటిని విడుదల చేసిన ఎమ్మెల్యే

సారంగాపూర్, ఆగస్టు 04, ప్రభాతవార్త:

స్వర్ణ ప్రాజెక్టు నుంచి పంట పొలాల సాగునీటి అవసరాల నిమిత్తం మంగళవారం బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి నీటిని విడుదల చేశారు. జౌళి నాలా ద్వారా 80 క్యూసెక్కులు, లెఫ్ట్ కెనాల్ ద్వారా 20 క్యూసెక్కులు.. మొత్తంగా 100 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. అనంతరం ప్రాజెక్టు గేట్ల లీకేజీలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే, అవసరమైన మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి వృథాను అరికడుతూ సాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రాజెక్టు నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యవసాయానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో, సాగునీటి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ రైతులకు అండగా ఉంటామన్నారు. రైతుల అవసరాన్ని బట్టి రానున్న రోజుల్లో నీటి విడుదలను మరింత పెంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఇరిగేషన్ శాఖ అధికారులు, రైతులు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



## స్వర్ణ ప్రాజెక్టు భూమిని కాపాడాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం

సారంగాపూర్, ఆగస్టు 04, ప్రభాతవార్త:

మండలంలోని స్వర్ణ గ్రామంలో గల స్వర్ణ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు మంగళవారం నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. స్వర్ణ ప్రాజెక్టుకు చెందిన ప్రభుత్వ భూమిలో కొందరు వ్యక్తులు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారని, మరికొందరు ప్రభుత్వ క్వార్టర్లను ఆక్రమించుకున్నారని తెలిపారు. అక్కడ ఇళ్లు నిర్మించి, కొన్నాళ్ల తర్వాత వాటిని ఇతరులకు అద్దెకు ఇస్తున్నారని పేర్కొన్నారు. ఈ అక్రమాలపై ప్రాజెక్టు అధికారులైన జేఈఈలకు, సంబంధిత ప్రభుత్వ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి, ప్రభుత్వ భూమిని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

# ఆహ్లాదకర వాతావరణంలో చదువు చెప్పాలి

**- పుస్తక పఠనంతో పిల్లల్లో ఆసక్తి పెరుగుతుంది - కలెక్టర్ భవేశ్ మిశ్రా - సోన్ మండల పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ**

నిర్మల్, ఆగస్టు 04, ప్రభాతవార్త:



చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఉపాధ్యాయులను ఆదేశించారు. పుస్తకాలను చదివించడం ద్వారా భాషా జ్ఞానంతో పాటు సబ్జెక్టుపై పట్టు పెరుగుతుందని తెలిపారు. మంగళవారం సోన్ మండల కేంద్రంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రాథమిక పాఠశాలను సందర్శించి, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు రోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థులతో ఇంగ్లీషు కథలు చదివించి, ప్రశ్నలు అడిగారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులను అభినందించి పెన్నులను బహుమతిగా అందజేశారు. అర్థం కాని పదాలను బ్లాక్ బోర్డుపై రాసి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో రోజూ కొంత సమయం తెలుగు, ఇంగ్లీషు కథలు చదివించాలని, సరికొత్త బోధనా పద్ధతుల ద్వారా పాఠాలు చెబితే విద్యార్థులకు నేర్చుకోవాలన్న ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. అనంతరం జడ్పీహెచ్ఎస్‌ను పరిశీలించి వసతులు, మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడంపై ఆదేశాలు ఇచ్చారు. పదవ తరగతి విద్యార్థులతో భౌతిక శాస్త్రంలోని దర్పణాల పాఠంపై మాట్లాడి, ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విషయాలను నిత్య జీవితానికి అనుసంధానించుకుని చదివితే సులభంగా అర్థమవుతుందని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసీల్దార్ సంతోష్, ఎంపీఓ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడిగా సయ్యద్ రిజ్వాన్ ఎన్నిక

కెరమెరి, ఆగస్టు 4 ప్రభాతవార్త:



నూతన ఉప సర్పంచుల ఫోరం కెరమెరి మండల కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోరం అధ్యక్షుడిగా సయ్యద్ అబ్దుల్ రిజ్వాన్, ఉపాధ్యక్షుడిగా పతంగే లింబదాస్, ప్రధాన కార్యదర్శిగా సూర్యావంశీ పరమేశ్వర్, సంయుక్త కార్యదర్శిగా మొహార్లే మోహన్, కోశాధికారిగా వాగ్మరే శ్రీకాంత్, సభ్యులు మడవి తుకారాం, బాంనే సాగర్, జాదవ్ దిలీప్, ఆత్రం బారికరావు, మొహార్లే రాందాస్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్లాడుతూ.. మండలంలోని ఉపసర్పంచ్‌లందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, ఉపసర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ కోసం సమిష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఉపసర్పంచ్‌లకు ప్రభుత్వ పరంగా రావలసిన గుర్తింపు, అధికారాల కోసం ఫోరం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడితో పాటు కార్యవర్గ సభ్యులను ప్రజాప్రతినిధులు, నాయకులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు అబ్దుల్ కలాం, పెందోర్ మోతిరాం, కెరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు, ఇందాపూర్ సర్పంచ్ బుచ్చయ్య, నాయకులు ఆత్రం రాము, షైక్ మున్ను, ఆడ రాంచందర్ తదితరులు ఉన్నారు.

## వరదల మధ్య వేగవంతంగా మంచినీటి పైపులైన్ పునరుద్ధరణ

**- పనులను పరిశీలించిన మేయర్ దర్ని మధుకర్...**

**త్వరలోనే తాగునీటి సరఫరా పునరుద్ధరణకు హామీ**

మంచిర్యాల, ఆగస్టు 4, ప్రభాతవార్త



భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న నగర ప్రధాన మంచినీటి పైపులైన్ పునరుద్ధరణ పనులను మంచిర్యాల మేయర్ దర్ని మధుకర్ మంగళవారం పరిశీలించారు. శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు పనుల పురోగతిని సమీక్షించి, అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. వరద నీటి ప్రవాహం మరోసారి పెరగడంతో పనులకు ఆటంకం ఏర్పడినా, యంత్రాల సహాయంతో ప్రవాహాన్ని మళ్లించి మరమ్మతు పనులను కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పనులను మరింత వేగవంతం చేసి, నాణ్యతతో పూర్తి చేసి నగర ప్రజలకు తాగునీటి సరఫరాను వీలైనంత త్వరగా పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని మేయర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జంతర్ మంతర్ ధర్నాకు మంచిర్యాల నుంచి సహారా బాధితుల భారీ ర్యాలీ

**- డిపాజిట్ సొమ్ము తక్షణమే చెల్లించాలని, సిబ్బందికి రక్షణ కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి**

మంచిర్యాల, ప్రభాతవార్త



న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఈ నెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్న నిరవధిక ధర్నాలో పాల్గొనేందుకు మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన సహారా బాధితులు, సిబ్బంది మంగళవారం మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, సహారాలో గడువు ముగిసిన స్థిర డిపాజిట్ సొమ్మును దేశవ్యాప్తంగా ఉన్న బాధితులకు వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే సహారాలో పనిచేస్తున్న లక్షలాది మంది సిబ్బందికి న్యాయం చేసి వారి ఉపాధిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని కోట్లాది మంది సహారా బాధితుల సమస్యను పరిష్కరించాలని, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కూడా ఈ అంశంపై స్పందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సహారా మేనేజర్ ఎస్.టి. రావు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. సహారా బాధితుల సంఘం జిల్లా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య ఆధ్వర్యంలో ఈ ప్రయాణం సాగింది.

## ముధోల్ ప్రాథమిక ఆస్పత్రికి ఈసీజీ మిషన్, వాటర్ ప్యూరిఫైర్ అందజేత

భైంసా, ఆగస్టు 04, ప్రభాతవార్త:

ముధోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి రూ. లక్ష విలువైన ఈసీజీ మిషన్, వాటర్ ప్యూరిఫైర్‌ను బహుమతిగా అందజేశారు. 197476 కాలంలో ఈ ఆస్పత్రిలో మొదటిసారిగా వైద్యాధికారిగా సేవలందించిన డాక్టర్ కర్ణకోట కళావతి, బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చిన సందర్భంగా యాభై ఏళ్ల నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. రోగులకు సౌకర్యార్థం తన సొంత నిధులతో ఈ యంత్రాలను ఆస్పత్రికి అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్ సిబ్బందితో కలిసి ఈసీజీ మిషన్, వాటర్ ప్యూరిఫైర్‌ను ప్రారంభించారు. ఐదు దశాబ్దాల క్రితం పనిచేసిన ప్రాంతాన్ని గుర్తుంచుకుని రోగుల సంక్షేమం కోసం విరాళం అందించిన డాక్టర్ కళావతికి ఆయన వీడియో కాల్ ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మల్లికార్జున్, అస్రార్, నర్సులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



# ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

**- 25 మందికి పరీక్షలు.. 11 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తింపు**

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త :**



ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. శిబిరానికి వచ్చిన 25 మందికి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించగా.. వారిలో 11 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. అవసరమైన వారికి విడతల వారీగా ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు సిర్పూర్ శాసనసభ్యులు, ప్రజాబంధు ఫౌండేషన్ అధ్యక్షులు డా. పాల్వాయి హరీష్ బాబు తెలిపారు. ప్రతి మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కంటి శుక్లాలు ఉన్నవారు, చూపు మందగించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ప్రతి మంగళవారం ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో నిర్వహించే కంటి పరీక్షలకు హాజరై వైద్యుల సూచనలు పొందాలని కోరారు. శిబిరంలో వైద్య సిబ్బంది, ప్రజాబంధు ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన నిర్వహిస్తున్న దృశ్యం

## శిశువు ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేష్ఠం

**తాండూర్, ఆగస్టు 4, ప్రభాతవార్త :**

శిశువు ఆరోగ్యానికి తల్లిపాలే శ్రేష్ఠమని తాండూర్ మండలం మాదారం సెక్టర్ ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి అన్నారు. బోయపల్లిలోని అంగన్వాడి కేంద్రంలో మంగళవారం స్థానిక సర్పంచ్ సుందిళ్ల శంకరమ్మ అధ్యక్షతన తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు ఒకటి నుంచి ఏడవ తేదీ వరకు అంగన్వాడి కేంద్రాలలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. శిశువు జన్మించిన గంటలోపు తల్లులు ముర్రు పట్టించాలని సూచించారు. తల్లిపాల ప్రాధాన్యత గురించి, శిశువుల ఆరోగ్యం గురించి మహిళలకు వివరించారు. అనంతరం పలువురు చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నల్లుల మహేష్, హెచ్ఎం మధుసూదన్, గ్రామపంచాయతీ సెక్రెటరీ సంధ్యారాణి, నాయకులు సుందిళ్ల భూమయ్య, రౌతు వెంకటేష్, అంగనవాడి టీచర్లు భాగ్యలక్ష్మి, పులవతి, విజయ, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.



## నిర్మల్‌లో జిల్లా స్థాయి యోగా పోటీలు

**- విద్యార్థుల నుంచి విశేష స్పందన**

**నిర్మల్, ఆగస్టు 04, ప్రభాతవార్త**

తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించారు. కల్లూరు సాయిబాబా మందిర్ సమావేశ మందిరంలో జరిగిన ఈ పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యోగరత్న డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ.. యోగా సాధన వల్ల శారీరక ఆరోగ్యం, మానసిక ఏకాగ్రత, క్రమశిక్షణ పెరుగుతాయన్నారు. ఈ పోటీలకు సంగీత తేజస్విని అబ్జర్వర్‌గా వ్యవహరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ అన్నపూర్ణ, జనరల్ సెక్రెటరీ మల్లేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారని తెలిపారు. వివిధ విభాగాల్లో గెలుపొందిన విజేతలకు బంగారు, రజత, కాంస్య పతకాలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం యోగా గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం. ప్రదీప్ సంగెం, సతీష్, రామకృష్ణ, ఎస్. మోనిక, ఎస్. మురళి, రజిత, ఈ. పవిత్ర, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పంపిణీని పరిశీలించిన సర్పంచ్ వేణుగోపాల్

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త :**



వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తున్న నేపథ్యంలో బారెగూడ గ్రామపంచాయతీ సర్పంచ్ కోట వేణుగోపాల్ స్థానిక రేషన్ దుకాణాన్ని సందర్శించి బియ్యం పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్ శ్రీనివాస్‌ను గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రేషన్ కార్డుల సంఖ్య, లబ్ధిదారుల వివరాలు, ఇప్పటివరకు మూడు నెలల బియ్యం ఎంతమందికి పంపిణీ చేశారు, ఇంకా ఎంతమంది లబ్ధిదారులు బియ్యం తీసుకోవాల్సి ఉందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సకాలంలో రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకోవాలని డీలర్‌కు సూచించారు. పంపిణీ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. పేద కుటుంబాల ఆహార భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి అందుబాటులోకి తీసుకురావడం కేంద్ర ప్రభుత్వ దూరదృష్టికి నిదర్శనమన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమకు కేటాయించిన రేషన్ బియ్యాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యుడు హరీష్, మాజీ వార్డు సభ్యుడు హనుమంతు, రేషన్ డీలర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న దృశ్యం

## గ్రామాలాభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలి

**- బోయపల్లి సర్పంచ్ సుందిళ్ల శంకరమ్మ**

**తాండూర్, ఆగస్టు 4, ప్రభాతవార్త :**

గ్రామాలాభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలని బోయపల్లి సర్పంచ్ సుందిళ్ల శంకరమ్మ అన్నారు. బోయపల్లిలో మంగళవారం మహిళల ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళలు వంటింటికి పరిమితం కాకుండా అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అవగాహన పెంచుకొని గ్రామాల అభివృద్ధికి సూచనలు అందించాలన్నారు. సర్పంచ్ శంకరమ్మ, పంచాయతీ సెక్రెటరీ సంధ్యారాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ రమాదేవి, హెచ్ఎం మధుసూదన్, ఉప సర్పంచ్ మహేష్ లను మహిళలు, నాయకులు శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుందిళ్ళ భూమయ్య, రౌతు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## పీచర్‌లో ఎస్‌హెచ్‌జీ వీఓ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**లక్ష్మణచాందా, ఆగస్టు 04, ప్రభాతవార్త:**

మండలంలోని పీచర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ వీఓ) భవనాన్ని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా సంఘాల బలోపేతానికి, గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇలాంటి మౌలిక సదుపాయాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేశ్వర్, మండల పార్టీ అధ్యక్షుడు చిన్నయ్య, మాజీ జెడ్పీటీసీ రమేష్, మండల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# దాడికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

**- తుడుం దెబ్బ నాయకులు డిమాండ్**

**తాండూర్, ఆగస్టు 4, ప్రభాతవార్త :**



జన్నారం అటవీ డివిజన్ ఇంధన్ పల్లి నాయకపుగూడ కు చెందిన ఆదివాసీ యువకులపై దాడి చేసిన అటవీశాఖ అధికారులపై తగిన చర్య తీసుకోవాలని తుడుం దెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. తాండూర్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తుడుం దెబ్బ తాండూర్ మండల అధ్యక్షుడు యాపల సమ్మయ్య, రాష్ట్ర కార్యదర్శి మండిగ రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గడ్డం మణికుమార్ మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులను పరిరక్షించాల్సిన అటవీశాఖ అధికారులే ఆదివాసీలపై దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. ఆదివాసి యువకులపై జరిగిన దాడి ఘటనపై ప్రభుత్వం, అటవీశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విచారణలో నిజం తేలితే ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణ విధులనుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అటవీ శాఖ జిల్లా అధికారి శాంతారాంను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి బదిలీ చేయాలన్నారు. బాధిత ఆదివాసీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ఘటనపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే తుడుం దెబ్బ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తుడుం దెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుర్సెంగ బాబురావు, ప్రధాన కార్యదర్శి బుర్స ప్రవీణ్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు పవుల ధర్మయ్య, కొలవార్ సేవా సంఘం మండల అధ్యక్షుడు గొల్లిశెట్టి బాపు, నాయక్ పోడ్ సేవా సంఘం మండల అధ్యక్షుడు జైనేని బాపు, నాయకులు టెకం జేష్, ఉరిడి వెంకటేష్, సాయి ప్రమోద్, అనిల్, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

**- సాధారణ మండల సమావేశంలో ప్రత్యేక అధికారి, జడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ**

**ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 4, ప్రభాతవార్త :**



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు అధికారులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహించిన మొదటి ఆసిఫాబాద్ మండల సమావేశం సాదాసీదాగా జరిగింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీవో శ్రీనివాస్ అధ్యక్షతన జెడ్పి సీఈఓ, కార్యాలయ ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు,స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతి అధికారి క్షేత్ర స్థాయిలో ఉంటూ ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేలా చూడాలన్నారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సమావేశంలో సూచించారు. గ్రామాల వారీగా నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రాధాన్యత ఆధారంగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రతి శాఖ బాధ్యత అని, సమస్యల పరిష్కారంలో నిరక్ష్యం లేకుండా పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. వివిధ శాఖల మండల అధికారులు పాల్గొని తమ శాఖల పురోగతి నివేదికలను వివరించారు. అంతకుముందు ప్రజా సమస్యల పరిష్కారంపై గ్రామ ప్రజాప్రతినిధులు అధికారులతో విస్తృతంగా చర్చించారు. మండలంలో ముఖ్యంగా తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మతులు, వంతెన నిర్మాణాలు, పారిశుద్ధం, విద్యుత్, విద్య, వైద్యం, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను సమావేశంలో ప్రస్తావించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంధాలయ శాఖ చైర్మన్ అనిల్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంగా, తాసిల్దార్ రియాజ్ అలీ, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.



## ప్రతి విద్యార్థి మొక్కను నాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలి

**- కాగజ్‌నగర్ డీఎఫ్ఓ అప్పయ్య**

**- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వనమహోత్సవ కార్యక్రమం**

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త :**


ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాగజ్‌నగర్‌లో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), ఈకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఆవరణలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిర్పూర్–కాగజ్‌నగర్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్, ఏసీఎఫ్ డా. ఎ. అప్పయ్య హాజరై మొక్కల పెంపకం, అటవీ సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో ప్రతి ఒక్కరి బాధ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి మాట్లాడుతూ.. వనమహోత్సవం వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందిస్తాయని అన్నారు. కళాశాల ప్రాంగణాన్ని మరింత హరితవనంగా తీర్చిదిద్దేందుకు ఎన్ఎస్ఎస్, ఈకో క్లబ్ చేస్తున్న కృషిని అభినందించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణ, డీఆర్ఓ డి. హేమలత, వైస్ ప్రిన్సిపాల్ డా. డి. లక్ష్మీనరసింహం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తుదూరు దత్తాత్రేయ, ఈకో క్లబ్ కోఆర్డినేటర్ డా. దేవేందర్ రెడ్డి వీరమల్ల, డా. ఈ. శారద, డి. జనార్ధన్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత వృత్తి విద్యా కోర్సులను ఉపయోగించుకోవాలి

**- ఎంపీడీఓ లక్ష్మీకాంత్**

**సారంగాపూర్, ఆగస్టు 04, ప్రభాతవార్త:**

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతీ యువకులు ప్రభుత్వం, ప్రముఖ సేవా సంస్థలు అందిస్తున్న ఉచిత శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సారంగాపూర్ ఎంపీడీఓ లక్ష్మీకాంత్ పిలుపునిచ్చారు. ప్రథమ్ ఫౌండేషన్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్డీసీ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వృత్తి విద్యా శిక్షణా కోర్సుల వివరాలను సోమవారం ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత శిక్షణతో పాటు యూనిఫాం, హాస్టల్ వసతి, భోజనం కల్పిస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఎన్ఎస్డీసీ కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికేట్‌తో పాటు ప్రముఖ కంపెనీల్లో 100 శాతం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండి 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన లేదా మధ్యలో ఆపేసిన గ్రామీణ యువతీ యువకులు ఈ కోర్సులకు అర్హులని చెప్పారు. ఆసక్తి గలవారు సారంగాపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ అధికారి పసుల రమేష్ మాట్లాడుతూ.. కంప్యూటర్ ట్రైనింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రికల్ ట్రైనింగ్, టూ వీలర్ మెకానిక్, సోలార్, హాస్పిటాలిటీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈ శిక్షణ విదేశాలకు వెళ్లేవారికి కూడా ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అజీజ్ ఖాన్, ఫౌండేషన్ సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.





## విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

**- మాదారం సర్పంచ్ కుషనపల్లి లక్ష్మణ్**

**తాండూర్, ఆగస్టు 4, ప్రభాతవార్త :**

విద్యార్థులు చిన్ననాటి నుండే ప్రశ్నించడం, నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని మాదారం సర్పంచ్ కుషనపల్లి లక్ష్మణ్ అన్నారు. మండలంలోని మాదారం గ్రామ పంచాయతీలో మంగళవారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి బాలల ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ అలవర్చుకొని ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేరచలన్నారు. దేశ భవిష్యత్ విద్యార్థుల చేతిలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు గొర్లపల్లి బాణేష్, గోదల లక్ష్మి, కత్తెర్ల రవికుమార్, గుండేటి లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు శ్రీలక్ష్మి, మోనిక, పంచాయతీ సెక్రెటరీ శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ మెడికల్ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే

**పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**

**ఆసిఫాబాద్, ఆగష్టు 4, ప్రభాతవార్త :**



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలను అసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులు, ల్యాబ్‌లు, లైబ్రరీ, హాస్టల్, ఆసుపత్రి వసతులు ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనుల పురోగతి, పనుల్లో ఎదురవుతున్న సమస్యల గురించి సంబంధిత ఇంజనీర్లు, అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు మెడికల్ కళాశాల అత్యంత కీలకమని, అందుకే నిర్దేశించిన గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి 15 రోజులకు ఒకసారి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించాలని, నిరక్ష్యం వహించే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

**లక్షెట్టిపేట, ఆగస్టు 04, ప్రభాతవార్త**



పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం శ్రేయస్కరమని ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల అంగన్వాడీ కేంద్రాల్లో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మొదటి రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు కొనసాగించడం పై అవగాహన కల్పించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారంతో పాటు రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయన్నారు. ప్రతి తల్లి పాల ప్రాముఖ్యతను గుర్తించి శిశువుకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ మమత, చైర్ పర్సన్ దొంత అంజలి నర్సయ్య, వార్డు కౌన్సిలర్ రాజు, అంగన్వాడీ టీచర్స్ శాంత, కృష్ణవేణి, ఆయా, తల్లులు పిల్లలు కిషోర బాలికలు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా బాలల సభ

**లింగాపూర్, ఆగస్టు 4, ప్రభాతవార్త,**

లింగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో స్థానిక సర్పంచ్ జాధవ్ రాజశేఖర్ ఆధ్వర్యంలో బాలల సభ కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో నెలకొన్న సమస్యలు, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల గురించి విద్యార్థులు,ఉపాధ్యాయులతో సర్పంచ్ నేరుగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లి పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయించినట్లు సర్పంచ్ తెలిపారు. రాబోయే రెండు నెలల వ్యవధిలో విద్యార్థులందరికీ సరిపడా కొత్త బెంచీలు అందజేస్తామని హామీ ఇచ్చారు. మన గ్రామంలోని విద్యార్థులకు నాణ్యమైన విద్య దక్కడమే నా లక్ష్యం. పాఠశాలలో ఎలాంటి మౌలిక వసతుల కొరత రానివ్వనని నాది పూర్తి బాధ్యత అని సర్పంచ్ ధైర్యాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో లింగాపూర్ పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బంది, రిసోర్స్ పర్సన్స్ జాధవ్ సంజీవ్, గ్రామ పెద్దలు జాధవ్ రమేష్, తదితర గ్రామ ప్రజలు విద్యార్థులు పాల్గొన్నారు.



# ఇంధనపల్లి ఇన్‌చార్జి ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణ సస్పెన్షన్

## ఆదివాసి యువకులపై దాడి ఘటనపై చర్య - కాళేశ్వరం జోన్ సీసీఎఫ్ ఉత్తర్వులు

**జన్నారం, ఆగస్టు 4, ప్రభాతవార్త**



కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్‌లోని ఇంధన్‌పల్లి రేంజ్ ఇన్‌చార్జి అటవీ క్షేత్రాధికారి (ఎఫ్ఆర్ఓ) లక్ష్మీనారాయణను మంగళవారం రోజున సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఇటీవల చేపలు పట్టేందుకు వెళ్లిన ఆరుగురు ఆదివాసి యువకులపై అకారణంగా దాడి చేసిన ఘటన నేపథ్యంలో కాళేశ్వరం జోన్ ప్రధాన అటవీ సంరక్షణాధికారి (సీసీఎఫ్) ప్రభాకర్ ఈ మేరకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. ఆదివారం ఇందన్‌పల్లి సమీపంలోని వాగులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఆదివాసి యువకులను ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణతో పాటు అటవీ సిబ్బంది తీవ్రంగా కొట్టారనే ఆరోపణలు వెలువడ్డాయి. ఈ ఘటనపై ఆదివాసి సంఘాలు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ గత రెండు రోజులుగా అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపట్టారు. రాస్తారోకో నిర్వహించడంతో పాటు కార్యాలయంపై దాడికి కూడా పాల్పడ్డారు. ఈ ఘటనపై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పందించి బాధిత ఆదివాసి యువకులకు అండగా నిలిచారు. సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నాలో పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధులు, ఆదివాసి సంఘాల నుంచి తీవ్ర ఒత్తిడి రావడంతో ఉన్నతాధికారులు వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని ఎఫ్ఆర్ఓ లక్ష్మీనారాయణను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. సరిగ్గా వారం రోజుల క్రితం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ విధులు నిర్వహించినందుకు లక్ష్మీనారాయణ హైదరాబాద్ లో అవార్డు అందుకున్నారు. రెండు రోజుల క్రితం నాయకపు గూడ యువకులను కొట్టిన విషయంలో విచారణ జరిపిన ఉన్నతాధికారులు లక్ష్మీనారాయణపై మంగళవారం సస్పెన్షన్ వేటు వేయడం సర్వత్రా చర్చ జరుగుతోంది. ఘటనపై పూర్తి స్థాయి విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.



## ఉచిత కంటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త :**

పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉన్న ఉచిత కంటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి-చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా. కొత్తపల్లి అనిత కోరారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కిమ్స్ మల్టిస్పెషాలిటీ ఆసుపత్రిలో సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 40 మంది హాజరయ్యారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు 15 మందికి కేటరాక్ట్ (కంటి శుక్లాలు) శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. ఎంపికైన వారికి సొసైటీ సొంత ఖర్చులతో రవాణా, భోజన సదుపాయాలు కల్పించి బెల్లంపల్లిలోని లయన్స్ క్లబ్ కంటి ఆసుపత్రికి తరలించి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు.ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ఈ ఉచిత కంటి వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే శస్త్రచికిత్సలు చేయించుకుని లబ్ధి పొందిన వారు ఇతరులకు కూడా ఈ సేవలపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలని కోరారు.కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ శ్రీనాథ్, ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి, కిమ్స్ ఆసుపత్రి సిబ్బంది, సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్యాచ్ ది రెయిన్‌పై విద్యార్థులకు అవగాహన

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త :**



వర్షపు నీటి సంరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో క్యాచ్ ది రెయిన్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పెట్రోల్ బంక్ సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు డ్రాయింగ్ పోటీ నిర్వహించారు. వర్షపు నీటి సంరక్షణ, నీటి పొదుపు, భూగర్భ జలాల పరిరక్షణ తదితర అంశాలపై విద్యార్థులు చిత్రాలు గీసి తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలో 10వ తరగతి విద్యార్థిని ఎనగందుల హర్షిత ప్రథమ బహుమతి, 8వ తరగతి విద్యార్థిని ఎనగందుల అద్వితీయ ద్వితీయ బహుమతి, 9వ తరగతి విద్యార్థి గుమ్మడి జితిన్ తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది టీపీఓ యశ్వంత్ కుమార్, ఏఈ నవీన్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ప్రీతమ్, జూనియర్ అసిస్టెంట్ సాయి సుమంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట రాజయ్య, దుగేందర్, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.



## కార్మిక, ఉపాధి శాఖ మంత్రి వివేక్‌ను కలిసిన శ్రీహరిరావు

**లక్ష్మణచాందా, ఆగస్టు 04, ప్రభాతవార్త:**

నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కూచడి శ్రీహరిరావు, లక్ష్మణచాందా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోండ్రు నరేష్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిశారు. ఈ సందర్భంగా కార్మిక, ఉపాధి కల్పనకు సంబంధించిన పలు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలపై మంత్రితో కూలంకషంగా చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## గంగాదేవి బోనాల జాతరను ఘనంగా విజయవంతం చేయండి

### - అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదాలు పొందాలని గంగాపుత్ర సంఘం పిలుపు

**మంచిర్యాల, ఆగస్టు 4, ప్రభాతవార్త**

తెలంగాణ గంగాపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 5న నిర్వహించనున్న గంగాదేవి బోనాల జాతరను ఘనంగా విజయవంతం చేయాలని సంఘం నాయకులు గంగాపుత్రులు, పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. అధిక సంఖ్యలో పాల్గొని గంగాదేవి అమ్మవారికి బోనాలు సమర్పించి ఆమె కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు. అమ్మవారి ఆశీస్సులు గంగాపుత్ర సమాజంపై ఎల్లప్పుడూ ఉండేలా భక్తిశ్రద్ధలతో జాతరలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్‌తో పాటు గాండ్ల రాజ్‌కుమార్, సూర్ల శంకర్, గుమ్ముల పోషం, అరెందుల రాజేశం, శకపూరి భీమసేన్, సూర్ల రాజు, గాండ్ల శంకర్, సూర్ల బుచ్చయ్య, ఎల్లెల రమేష్, సూర్ల భీమయ్య, గాండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## బడికల శ్రావణ్ అనుచిత వ్యాఖ్యలపై తీవ్ర ఖండన

**బెల్లంపల్లి, ఆగస్టు 04, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సమావేశం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బండి ప్రభాకర్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ లపై బడికల శ్రావణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ప్రజల అభిమానం పొందకుండా బాధ్యతగల ప్రజా ప్రతినిధులపై అడ్డగోలుగా మాట్లాడడం తగదని హెచ్చరించారు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా వ్యవహరించిన వారు, ఇప్పుడు ప్రజలకు ఉపయోగపడే పనులు చేస్తున్న నాయకులపై విమర్శలు చేయడం సరికాదని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడానికి అర్థరహిత ఆరోపణలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఇచ్చిన ఓటు హక్కుతో ఎన్నుకున్న నాయకులపై అవమానకర వ్యాఖ్యలు చేయడం, బెదిరింపులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. అదేవిధంగా, బడికల శ్రావణ్‌కు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. చర్చకు వేదిక, తేదీ, సమయం ప్రకటిస్తే తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంభాల రాజేష్, ఎండి కాజా పాషా, ఎలుక ఆకాష్, కన్నూరి వెంకటేష్, దెబ్బటి రమేష్, గద్దల కుమార్, గీస రాజేశం, మొండి, పట్టి నవీన్, అలీ భాయ్, చుంచుల వెంకటేష్, పోరండ్ల సత్యవతి, కొమ్ము అనసూర్య, లక్ష్మి, రాజేశ్వరి, పద్మ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ జాడి లక్ష్మికి క్షమాపణ చెప్పాలి

### హరీష్ గౌడ్‌పై నేతకాని సంక్షేమ సంఘం డిమాండ్

**బెల్లంపల్లి, ఆగస్టు 04, ప్రభాతవార్త**

నెన్నెల మండలంలోని జోగాపూర్ మైలారం బీటీ రోడ్డు పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రోటోకాల్‌ను పాటించకుండా గొల్లపల్లి గ్రామ దళిత మహిళా సర్పంచ్ జాడి లక్ష్మిని అవమానించారని ఆరోపిస్తూ, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్ గౌడ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలాలి నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి గోమాస రాజం, జాడి రాంచందర్, సర్పంచ్ జాడి లక్ష్మి, మాజీ ఎంపీపీ గోమాస శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు చదువుల వెంకటరమణ మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పాల్గొన్న జోగాపూర్-మైలారం బీటీ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమానికి సర్పంచ్ జాడి లక్ష్మిని ఆహ్వానించినప్పటికీ, ఆమె చేత పనులు ప్రారంభించకుండా ఎన్నికల్లో ఓటమి చెందిన వ్యక్తితో ప్రారంభోత్సవం నిర్వహించడం దళిత మహిళా ప్రజాప్రతినిధిని అవమానించడమేనని ఆరోపించారు. గ్రామ సర్పంచ్‌కు ప్రోటోకాల్ ప్రకారం ఇవ్వాల్సిన గౌరవాన్ని ఉద్దేశపూర్వకంగా నిరాకరించారని విమర్శించారు. ఈ విషయాన్ని సర్పంచ్ జాడి లక్ష్మి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా స్పందన రాలేదని, దళిత మహిళా సర్పంచ్ అవమానానికి తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం విచారకరమని పేర్కొన్నారు. హరీష్ గౌడ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆయన నివాసాన్ని ముట్టడించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అలాగే మండలంలో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న డబ్బుల వసూళ్ల వ్యవహారంపై కూడా పూర్తి వివరాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. ఈ సమావేశంలో నేతకాని సంక్షేమ సంఘం నాయకులు జాడి నారాయణ, బెడ్డల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

